క్లుప్తంగా

126 మందికి కంటి పరీక్షలు



శిబిరంలో కంటి పరీక్ష చేస్తున్న వైద్యులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామకోటి ప్రాంగణంలో లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్రవైద్యశాల వైద్యుల బృందం 126 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 17 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించి ఆసుపత్రికి తరలించారు. 27 మందికి సబ్సిడీపై కళ్లజోళ్లు అందజేశారు. బొలిశెట్టి సురేష్ కుమార్, చెన్నా వెంకటరామయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఏలూరు నాయకులకు రాష్ట్ర పదవులు

ఏలూరు టౌన్ : వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏలూరు జిల్లాకు చెందిన పార్టీ నాయకులకు పదవులు కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏలూరు జిల్లాకు చెందిన గోరుముచ్చు గోపాల్‌యాదవ్‌ను పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, కేజేవీఎస్ పుండరీకాక్షుడును రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా, ఏలూరు నియోజకవర్గానికి చెందిన తాడేపల్లి వినయ్ కుమార్‌ను రాష్ట్ర ఐటీ విభాగం కార్యదర్శిగా నియమించినట్టు పేర్కొంది.

నేడు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ప్రచారం

ఏలూరు రూరల్ : దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఏలూరు రూరల్ మండల గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటలకు చాటపర్రులో ప్రచారం ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు జాలిపూడి చేరుకుంటారు. తిరిగి సాయంత్రం నాలుగు నుంచి రాత్రి 10 గంటల వరకు కాట్లంపూడి, మాదేపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

భీమడోలు: ప్రజాస్వామ్యయుత, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రజలంతా సహకరించాలని ఎస్సై వై.సుధాకర్ అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో భాగంగా ఆదివారం సాయంత్రం ఎస్సై వై.సుధాకర్ ఆధ్వర్యంలో సాయుధ దళాల సిబ్బది, పోలీస్ సిబ్బంది పోలసానిపల్లి, వడ్లపట్ల, వసంతనగర్, కొండ్రెడ్డినగర్ గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలులో ఉన్నందున ఎన్నికల నియమ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని, విఘాతం కలిగించేలా కార్యకలాపాలు చేస్తే చర్యలు తప్పవంటూ వీధుల్లో పోలీస్ కవాతు నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలకు నిబంధనలపై అవగాహన కల్పించారు. రాజ్యాంగబద్ధంగా ప్రజలకు కల్పించిన ఓటు హక్కును మే 13న ప్రతి ఓటరు నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. గ్రామాల్లో రాజకీయ నాయకులు ఎన్నికల నిబంధనలు పాటించాలని, వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంటుందని చెప్పా రు. గ్రామాల్లో పోలీసుల నిఘా పెంచామన్నారు.

గడప వద్దకే సంక్షేమం.. జగన్‌పై నమ్మకం

- ఏలూరు 30వ డివిజన్ అభివృద్ధిపై ప్రజల హర్షం
- మోతేవారితోట-1, -2 సచివాలయాల్లో రూ.28 కోట్ల లబ్ధి
- డాక్టర్ వైఎస్సార్ యూపీహెచ్‌సీ నిర్మాణం
- పార్కు అభివృద్ధి, సీసీ రోడ్ల నిర్మాణం



చాణక్యపురి కాలనీ ఏటిగట్టు ప్రాంతంలో నిర్మించిన యూపీహెచ్‌సీ



నగరపాలక సంస్థ పార్కు అభివృద్ధి



మంచినీళ్లతోట ప్రాంతంలో నిర్మించిన సీసీ రోడ్డు



వినాయకుడి గుడి ప్రాంతంలో నిర్మించిన సీసీ రోడ్డు

ఏలూరు టౌన్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే మేనిఫెస్టోలో చెప్పిన హామీల అమలుకు శ్రీకారం చుట్టారు. ప్రతి అంశాన్నీ పక్కాగా నెరవేర్చి చూపించారు. నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలు పెద్దెత్తున అమలు చేశారు. సంక్షేమ పథకాలను ప్రజల గడప వద్దకే చేర్చారు. నేరుగా అర్హుల బ్యాంకు ఖాతాల్లోకే పథకాల లబ్ధిని జమ చేయించారు. దళారులు, దోపిడీదారుల ప్రమేయానికి చెక్ పెట్టారు. వైఎస్సార్ సీపీ హయాంలో ప్రతి ప్రాంతం అభివృద్ధి చెందింది. ప్రతి కుటుంబానికీ మేలు జరిగింది. దీంతో మా నమ్మకం నువ్వే జగన్.. నువ్వే కావాలి జగన్ అని ప్రజలు కోరుకుంటున్నారు. ముఖ్యమంత్రికి వారి ఆశీస్సులు అందిస్తున్నారు. టీడీపీ హయాంలో మేనిఫెస్టోలోని హామీలను అమలు కాలేదని, సంక్షేమ పథకాలు మంజూరు చేసినా లబ్ధిదారులకు చేరే సరికి సగానికి సగం దళారుల చేతుల్లోకి వెళ్లేవని గుర్తుచేసుకుని విస్తుపోతున్నారు.

అభివృద్ధిని చూపించారు

ఏలూరు 30వ డివిజన్‌లో 59 నెలల కాలంలో ఎమ్మెల్యే ఆళ్ల నాని అభివృద్ధి చేసి చూపించారు. రెండున్నరేళ్లు కరోనాతో ఇబ్బందులు పడినా.. అనుకున్న స్థాయిలో అభివృద్ధి పనులు చేయించారు. మంచినీళ్ల తోట ప్రాంతంలో సుమారు 10 ఏళ్లకుపైగా సరైన రోడ్లు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులకు చెక్ పెట్టారు. డి-మార్ట్ ఎదురు రోడ్డు, వినాయకుడి గుడి రోడ్డుతోపాటు ఇక్కడ రూ.60 లక్షలతో నాలుగు సీసీ రోడ్లను నిర్మించారు. చాణక్యపురి కాలనీలో నగరపాలక సంస్థ పార్కును రూ.30 లక్షల ఇడా నిధులతో అభివృద్ధి చేశారు. రూ.80 లక్షలతో డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను నిర్మించారు. డివిజన్‌లోని మంచినీళ్లతోట, చాణక్యపురి కాలనీ, ఏటిగట్టు ప్రాంతం, పత్తేబాదలోని కొంత ప్రాంతం పరిధిలో ప్రజలకు సమీపంలోనే రెండు సచివాలయాలను ఏర్పాటు చేశారు.

సంక్షేమ ఫలాలు

అత్యధికంగా బీసీలు నివసించే 30వ డివిజన్‌లోని రెండు సచివాలయాల పరిధిలో డీబీటీ, నాన్ డీబీటీ రూపంలో సుమారు రూ.28 కోట్లు సంక్షేమ ఫలాలు అందాయి. మోతేవారితోట సచివాలయం-1 పరిధిలో డీబీటీ రూపంలో రూ.6,82,72,771 లబ్ధి చేకూరింది. నాన్ డీబీటీలో రూ.5,77,50,803 అందించారు. మోతేవారితోట సచివాలయం-2 పరిధిలో డీబీటీ రూపంలో రూ.8,69,36,929 సొమ్ము అందజేయగా, నాన్ డీబీటీ రూపంలో రూ.6,70,95,226 ప్రభుత్వం అందించింది.

సంక్షేమ పథకాలు అందాయి



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మా కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాయి. మా కుటుంబంలో పింఛన్, చేయూత పథకం లబ్ధి చేకూరింది. ఎమ్మెల్యే ఆళ్ల నాని హయాంలో మాకు ఇంటి స్థలం వచ్చింది. ఈ ప్రభుత్వం వచ్చాక పేదవాళ్లకు అన్నీ మంచిగానే జరుగుతున్నాయి. మళ్లీ ఇదే ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నాం.

– కర్రి సూర్యనారాయణ, ఏలూరు

సీఎం జగన్‌తోనే మేలు



గతంలో ఏ ప్రభుత్వంలోనూ లేనివిధంగా అన్ని కులాల్లోని పేదలకు వైఎస్సార్ సీపీ హయాంలో మేలు జరిగింది. మా కుటుంబంలో మహిళలకు చేయూత అందింది, ప్రతి నెలా 1న ఉదయమే పింఛన్ సొమ్ము వలంటీర్ అందిస్తున్నారు. మాకు సమీపంలోనే సచివాలయం ఉండడంతో పనులు సకాలంలో పూర్తవుతున్నాయి.

– ముత్తోజు వీరాచార్యులు, ఏలూరు

అన్ని ప్రాంతాల అభివృద్ధికీ కృషి



నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతాన్నీ అభివృద్ధి చేయటానికి ఎమ్మెల్యే ఆళ్ల నాని కృషి చేస్తున్నారు. మంచినీళ్లతోట ప్రాంతంలో రోడ్ల సమస్యకు పరిష్కారం చూపుతూ.. తాజాగా నాలుగు సీసీ రోడ్లు నిర్మించారు. దీంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్కుల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు జగన్ హయాంలోనే జరిగాయి.

– బనిశెట్టి పూర్ణచంద్రరావు, 30వ డివిజన్ నాయకులు

మరోసారి విజయం తథ్యం



మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే వస్తుందని ప్రజలు నమ్ముతున్నారు. ఇంత గొప్పగా ఏనాడు ప్రభుత్వాలు ప్రజలకు సంక్షేమాన్ని అందించలేదు. పైగా ప్రజల ఇంటివద్దకే ప్రభుత్వ పాలన తీసుకురావటం పట్ల ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని అందిస్తోన్న ఘనత జగన్‌కే దక్కుతుంది.

– వైఎస్‌వీ శివరావు, జేసీఎస్ జిల్లా కన్వీనర్

స్టేడియంలో చలివేంద్రం ఏర్పాటు



స్టేడియంలో చలివేంద్రం ఏర్పాటుచేసిన వాకర్స్

ఏలూరు రూరల్ : క్రీడాకారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటుచేశామని ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎం అక్బర్ తెలిపారు. ఆదివారం స్టేడియంలో వాకర్స్‌తో పాటు క్రీడాకారులకు మజ్జిగ, మంచినీరు అందజేశారు. ఈ సందర్భంగా అక్బర్ మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఉదయం సాయంత్రం వాకింగ్ చేసే పెద్దలు, క్రీడాకారులకు తీవ్ర అలసటకు గురౌతున్నారని తెలిపారు. దీంతో స్టేడియంలో ప్రత్యేకంగా చలివేంద్రం ఏర్పాటుచేశామని, ప్రతిరోజూ చల్లని తాగునీరు అందుబాటులో ఉంచుతామని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు నాగ విజ్ఞేశ్వరరావు, ఎస్‌టీఓ శ్రీనివాసరావు, జగదీష్, విశ్వనాథం, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి విజ్ఞాన తరగతులు



భీమడోలులో వేసవి విజ్ఞాన తరగతులపై అవగాహన కల్పిస్తున్న మండే సుధాకర్

భీమడోలు: వేసవి సెలవులను విద్యార్థులు సరదాగా గడపాలన్న లక్ష్యంతో ఈనెల 29 నుంచి జూన్ 7వ తేదీ వరకు గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలనులో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. భీమడోలులో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి వివిధ పాఠశాలల చిన్నారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకులు డీఎన్‌వీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

పెదవేగి : అనారోగ్య సమస్యలతోపాటు ఆర్థిక ఇబ్బందులతో వెంటాడుతున్న ఓ నిరుపేద కుటుంబానికి శ్రీ సాయి హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ అండగా నిలిచింది. ఆదివారం పెదవేగి మండలం విజయరాయి పంచాయతీ ముత్తనవీడు మెట్టకు చెందిన బత్తుల చిరంజీవికి ఇద్దరు కుమారులు వీరు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బత్తుల అజయ్‌కుమార్ ఆరో తరగతి, బత్తుల తనుష్ కుమార్ ఎనిమిదో తరగతి చదువుతున్నారు. వీరిరువురు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. కనీసం వైద్య ఖర్చులకు కూడా తగినంత స్తోమత లేక అజయ్‌కుమార్ కామెర్లతో, ధనుష్ కుమార్ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. దీనిని గమనించిన శ్రీ సాయి హెల్పింగ్ హాండ్స్ సభ్యులు పి ఉమామహేశ్వరరావు సంస్థకు విషయాన్ని వివరించారు. దీనిపై స్పందించిన సంస్థ సభ్యులు బాధిత కుటుంబాన్ని సందర్శించి వీరి తల్లి బత్తుల భూలక్ష్మికి రూ.15 వేలను అందించారు. విద్యార్థుల ఉన్నత చదువుల కోసం సంస్థ తరపున సహాయం చేస్తామని సభ్యులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు బీఆర్వీ కుమార్, డీకేఎస్ఎస్ ప్రకాష్ రావు, జి.రాజు, జి.మోహన్ పాల్గొన్నారు

మళ్లీ వైఎస్సార్ సీపీదే అధికారం

ఎమ్మెల్యే ఆళ్ల నాని



తాపీమేస్త్రీ కాలనీలో జై ఆళ్ల నాని అంటూ నినదిస్తున్న మహిళలు



29వ డివిజన్‌లో చిన్నారిని ఆప్యాయంగా పలుకరిస్తున్న ఎమ్మెల్యే నాని

ఏలూరు టౌన్: మరో రెండునెలల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టటం ఖాయమని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు 29వ డివిజన్‌లో ఆదివారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. కుమ్మరిరేవు దుర్గమ్మగుడి ప్రాంతం నుంచి ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. కార్పొరేటర్ ఉచ్చుల సుజిత, వైఎస్సార్ సీపీ నాయకులు సన్నీచైతన్య ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యే నానికి స్వాగతం పలికారు. తాపీమేస్త్రీ కాలనీ, తదితర ప్రాంతాల్లో ప్రతి గడపకూ వెళుతూ ప్రజలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని గుర్తు చేస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ చంద్రబాబుకు ఎన్నికలు వస్తేనే ప్రజలు గుర్తుకు వస్తారని ఎద్దేవా చేశారు. పేద, మధ్య తరగతి వర్గాలకు మంచి చేయటం చంద్రబాబుకు ఎప్పుడు ఇష్టం ఉండదని, అందుకే సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు నిత్యం అడ్డుపడుతూ వచ్చారని గుర్తు చేశారు. అమరావతి రాజధాని అంటూ అక్కడ పేదలు మాత్రం ఉండకూడదని, సామాజిక అసమతుల్యత వస్తుందంటూ కోర్టులో కేసులు వేయించిన విషయం ప్రజలు మర్చిపోలేదని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రతి పేదవానికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని చెప్పారు. పేదలకు స్థలం, ఇల్లు కట్టించి ఇచ్చేందుకు సీఎం జగనన్న ప్రయత్నిస్తే, వాటిని అడ్డుకునేందుకు చంద్రబాబు విశ్వప్రయత్నం చేశారని ఆరోపించారు. మరోసారి ఎన్నికలకు ముందు వచ్చి మోసపూరితమైన, అమలు సాధ్యం కాని హామీ ఇస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని, వాటిని ప్రజలు ఎవరూ విశ్వసించటం లేదని ఎమ్మెల్యే నాని చెప్పారు. ప్రచారంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మున్నుల జాన్‌గురునాథ్, ఇడా ఛైర్మన్, నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, ఏఎంసీ ఛైర్మన్ నెరుసు చిరంజీవులు, పార్టీ క్లస్టర్-3 అధ్యక్షుడు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ మంచెం మైబాబు, నగర డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రచారంలో వైఎస్సార్ సీపీ స్టార్ క్యాంపెయినర్లు



ఏలూరు టౌన్: 37వ డివిజన్‌లో జేసీఎస్ జిల్లా కన్వీనర్ శివ, తోలేటి శ్రీనివాస్, నాగశంకర్‌ల ప్రచారం



ఏలూరు టౌన్: 16వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ జిజ్జువరపు విజయ నిర్మల, నాయకులు



ఏలూరు టౌన్: 18వ డివిజన్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న కార్పొరేటర్ ఎం కేదారేశ్వరి



ఏలూరు టౌన్: వన్‌టౌన్‌లో వృద్ధుల ఓట్లు అడుగుతున్న పార్టీ నేత రమేష్

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ స్టార్ క్యాంపెయినర్లు ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఆళ్ల నాని, కారుమూరి సునీల్ కుమార్‌ల విజయం కోరుతూ ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆదివారం ఏలూరు 37వ డివిజన్‌లో జేసీఎస్ జిల్లా కన్వీనర్ వైఎస్‌వీ శివరావు, పార్టీ నాయకులు తోలేటి శ్రీనివాస్, సీహెచ్ రామనాగ శంకర్‌ల ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ప్రజలను కలిసి ఓట్లు అభ్యర్థించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సారిక దుర్గ, కనపర్తి నవీన్, అఖిల, ధన, మహాలక్ష్మి, సువర్చల, స్వర్ణజ్యోతి, బొండాడ దుర్గారావు, బెల్లంకొండ సుజాత, కోమర్తి సత్యలక్ష్మి ఉన్నారు.

- వన్‌టౌన్‌లోని 16వ డివిజన్‌లో కార్పొరేటర్ జిజ్జువరపు విజయ నిర్మల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేశారు. డివిజన్‌లో అభివృద్ధి, సంక్షేమం మళ్లీ కొనసాగాలంటే వైఎస్సార్ సీపీ విజయం సాధించాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు జిజ్జువరపు రమేష్ అవ్వాతాతల వద్దకెళ్లి వారితో ఆప్యాయంగా మాట్లాడారు. ఫ్యాన్ గుర్తుకు ఓట్లేయాలని అభ్యర్థించారు. ప్రతినెలా 1న పింఛన్ ఇంటికే రావాలంటే ఫ్యాన్ గుర్తును మర్చిపోవద్దని కోరారు.



ఏలూరు రూరల్ : మాదేపల్లిలో నాయకుల ప్రచారం

- 18వ డివిజన్‌లో కార్పొరేటర్ ఎం.కేదారేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు ఇనపనూరి జగదీష్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. మహిళలకు మళ్లీ సంక్షేమ పథకాలు రావాలన్నా.. మహిళలకు రక్షణ కావాలన్నా.. రాజకీయంగా అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని, ఏలూరులో ఎమ్మెల్యేగా మరోసారి ఆళ్ల నానిని గెలిపించాలని కోరారు.

సంక్షేమం కొనసాగాలి

ఏలూరు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసే సంక్షేమ పథకాలు కొనసాగాలని ప్రజలు కోరుకుంటున్నట్టు జాలిపూడి సొసైటీ చైర్మన్ బొల్లిముంత రాము అన్నారు. ఆదివారం ఏలూరు రూరల్ మండలం మాదేపల్లిలో వైఎస్సార్ సీపీ శ్రేణులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో సంక్షేమ పథకాలు ప్రజల జీవితాలతో ముడిపడిపోయాయన్నారు. పథకాలు వారిని అదుకున్నాయని చెప్పారు. ప్రజలు మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సర్పంచ్ కొరపాటి ప్రభుదేవ్ మాట్లాడుతూ ఈ ఐదేళ్ల కాలంలో మాదేపల్లిలో రూ.కోట్లతో ప్రభుత్వం అభివృద్ధి చేసిందన్నారు. గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంకులు, డ్రెయినేజీ, సీసీరోడ్ల నిర్మాణం, జెడ్పీ పాఠశాల అభివృద్ధి చేసినట్టు చెప్పారు. మరోసారి ఎమ్మెల్యేగా అబ్బయ్యచౌదరికి విజయాన్ని కట్టబెడతారన్నారు. ఉపసర్పంచ్ నరహరిశెట్టి రాధాకృష్ణ మాట్లాడుతూ టీడీపీ హయాంలో గ్రామంలో పంటచేలు ముంపు బారిపడినా పట్టించుకోలేదని గుర్తుచేశారు. వైఎస్సార్ సీపీ పాలనలో తమ్మిలేరు గట్టు చుట్టూ రివిట్‌మెంట్ నిర్మించి పంటచేల ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారని చెప్పారు. ఇళ్లులేని పేదల కోసం ప్రభుత్వం 20 ఎకరాలు భూమి కొనుగోలు చేసిందన్నారు. లక్షలాది రూపాయలతో మెరక చేసి పేదలకు ఇళ్ల స్థలాలను అందించిందని తెలిపారు.

రక్షణ సువార్త మహోత్సవాలు



ఎరుషాలేం ప్రేయర్ మినిస్ట్రీస్ సువార్త మహోత్సవాలు

దెందులూరు: సువార్త మరింత విశ్వవ్యాప్తం కావాలని, ప్రతి ఒక్కరూ దేవుని అడుగుజాడల్లో పయనించాలని దెందులూరు ఎరుషాలేం ప్రేయర్స్ మినిస్ట్రీస్ సిస్టర్ గ్రేస్‌రాణి అన్నారు. దెందులూరులో 3 రోజులుగా రక్షణ సువార్త మహోత్సవాలు ఎరుషాలేమ్ ప్రేయర్స్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఆదివారం దెందులూరుతో పాటు సమీప విశ్వాసులు అధిక సంఖ్యలో సువార్త మహోత్సవాల్లో పాల్గొన్నారు. పలువురు ప్రసంగీకులు దేవుని వాఖ్య పరిచయం చేశారు.